

తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,579.25	1,579.37
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	931	3,978
సామర్థ్యం (టీఎంసీలు)	4.12	4.17

పట్టీలే పట్టించాయా..?

● నగదు ఏ పార్టీ నేతదో.. ఆరా తీస్తున్న పోలీసులు

● బంగారు వ్యాపారి మహిళకు బహుమతిగా ఇచ్చిన వెండి పట్టీలతోనే భారీ సొమ్ము బయట పడిందా..?
● సంచుల కొద్దీ సొమ్మును చూసి అవాక్కయిన పోలీసులు ● హవాలాలో వచ్చిందెంత... పంచిన సొమ్మెంత..?



బళ్లారిలో పట్టుబడిన నగదు, బంగారు ఆభరణాలు

బళ్లారి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నగరంలో భారీ స్థాయిలో నగదు, బంగారు, వెండి ఆభరణాలు బయట పడడం స్థానికులతో పాటు పోలీసులు సైతం అవాక్కవుతున్నారు. అయితే కాళ్ల పట్టీలే వ్యాపారిని పట్టించాయని పలువురు చర్చించు కుంటున్నారు. ఎన్నికల వేల బళ్లారిలోని పూల మార్కెట్ వద్ద బంగారు వ్యాపారి నరేష్ ఇంట్లో ఆదివారం పోలీసులు స్వాధీనం చేసు కున్న రూ.5 కోట్ల 60 లక్షల నగదు, 3 కిలోల బంగారు, 130 కిలోల వెండిపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ మొదలయ్యింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇంత పెద్ద మొత్తంలో నగదు, బంగారు, వెండి దొరకడం పై అనేక కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. అసలు ఇంత పెద్ద మొత్తంలో నగదు ఉందన్న సమాచారం పోలీసులకు ఎలా చేరింది అనేదే చర్చనీయాంశమయ్యింది.

● వాస్తవానికి ఆ వ్యాపారి కొందరు మహిళలకు గిఫ్టుగా కాళ్లకు ధరించే వెండి గజ్జెలు ఇచ్చారని, దీన్ని ఒక రాజకీయ పార్టీ నాయకులు పసిగట్టు పోలీసులకు సమాచారం ఇచ్చారని కొందరు చర్చించుకుంటున్నారు. ముందుగా బ్రూస్‌పేట్ పోలీసులు పకడ్బందీగా ఆ వ్యాపారి ఇంట్లో సోదాలు నిర్వహించారు. పోలీసులు సోదాలు చేసే సమయంలో యజమాని లేరు. కేవలం ఇంట్లో ఆడవాళ్లు, పనివాళ్లు మాత్రమే ఉన్నారు. ముందుగా పోలీసులు ఒక రూములు పాన్ పరాగ్, గుట్కా వేసుకునే బస్తాలను తెరిచి చూశారు. రూ. 500 నోట్ల కట్టలు కనిపించాయి. పోలీసులు ఒకే బ్యాగులో ఉన్నాయోమో అనుకున్నారు. కానీ ఇళ్లంతా సోదిస్తే ఏకంగా భారీగా సంచుల కొద్దీ నోట్ల కట్టలు బయట పడ్డాయి. పనిలో పనిగా పై అంతస్తులో బెడ్ కింద బంగారు బిస్కెట్లు, అలాగే ఒక మూలన వెండి తో తయారు చేసిన కళ్లకు ధరించే గజ్జెల మూటలు బయట పడ్డాయి. వీటన్నిటినీ పోలీసులు స్వాధీనం చేసుకుని కోర్టులో అందజేశారు. దాదాపు 10 గంటల పాటు సోదాలు జరిపారు. హవాలా దందా చేయడం వీరికి కొత్త కాదు, ఒక రాష్ట్రం నుంచి ఒక పార్టీ అభ్యర్థికి చేరేందుకు రూ. 25 కోట్లు డబ్బులు హవాలా ఉందని పోలీసులకు సమాచారం ఉంది. ఈ నేపథ్యంలోనే పోలీసులు సోదాలు నిర్వంచారని సమాచారం. ఆ వ్యాపారి చాలా మందికి గజ్జెలు గిఫ్టుగా ఇవ్వడంతో కొందరు నేతలు పోలీసులకు సమాచారం ఇచ్చారని తెలుస్తోంది. అయతే ఇది వ్యాపార లావాదేవీలకు నిల్వ ఉంచిన నగదు, అన్నిటికీ రికార్డులు, రశీదులు ఉన్నాయని ఆ వ్యాపారి పోలీసులతో పేర్కొన్నట్లు సమాచారం. అయితే ఎన్నికల వేళ భారీగా నగదు పట్టుకోవడంపై పోలీసులను ప్రజలు మెచ్చుకోవడం కనిపిస్తోంది.

బడా నేతలతో నరేష్‌కు సంబంధాలు..!

బంగారు వ్యాపారి నరేష్ గాలి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములుకు అత్యంత సన్నిహితుడని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. వారితో దగ్గరగా ఉన్న ఫొటోలు కూడా సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. అసలు సొమ్ము ఏ పార్టీకి చెందిన వారివో అనేది పోలీసుల విచారణ తేలాల్సి ఉంది.



సంచుల కొద్దీ పట్టుబడ్డ వెండి పట్టీలు

టమోత..!

● కిలో రూ.40 పలుకుతున్న టమోటా ● రైతుల్లో హర్షం

కంప్లి, ఏప్రిల్ 8 : ఇన్నాళ్లు రైతులకు కన్నీళ్లు పెట్టించిన టమోటా ధరలు ఇప్పుడు మళ్లీ కాసులు కురిపిస్తున్నాయి. గిట్టుబాటు కాక పంటను తొలగించి వేరే పంట వేసుకోవాల నుకున్న రైతులకు మళ్లీ ఆశలు చిగురించాయి. కిలో రూ. పది వున్న ధర ఒక్కసారిగా రూ. 40కు చేరుకోవడంతో అన్నదాత హర్షం వ్యక్తం చేస్తున్నారు. పండగల వేళ టమోటాకు మరింత డిమాండ్ పెరిగింది. టమోటా ధరలు పెరగడంతో బోర్ల కింద టమోటా సాగు చేసిన రైతులకు కొద్ది వరకు సంతోషాన్ని మిగిలిస్తున్నాయి. పెట్టుబడి పోను లాభాలు మిగుల్తున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న టమోటా



వివాదానికి కారణమైన ఆలయం, రాళ్లు రువ్వుకుంటున్న ఇరు వర్గాలు

విగ్రహ ప్రతిష్ఠలో ఉద్రిక్తత

● ఇరువర్గాలు పరస్పరం రాళ్ల దాడి ● పోలీసులకు గాయాలు ● గ్రామంలో 144 సెక్షన్ : ఎస్పీ

బళ్లారి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): విగ్రహ ప్రతిష్ఠలో ఇరువర్గాల మధ్య ఏర్పడిన ఘర్షణ ఉద్రిక్తతకు దారి తీసింది. ఒకరిపై ఒకరు రాళ్ళు రువ్వుకోడంతో పోలీసు అధికారులు గాయిపడిన ఘటన బళ్ళారి తాలూకా పరిధిలోని కొళగల్లు గ్రామంలో చోటుచేసుకుంది. ఆదివారం కొళగల్లు గ్రామంలో ఎర్రియప్ప విగ్రహ ప్రతిష్ఠలో వివాదం మొదలయ్యింది. పరిస్థితి అదుపు చేసేందుకు వెళ్ళిన పోలీసులపై గ్రామస్తులు రాళ్ళు రువ్వడంతో రూరల్ పీఎస్ఐకి రాయి తగలడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కొళగ్లు గ్రామంలో ఎర్రితాత దేవాలయం ఉంది. ఎర్రితాత శిష్యులు ఎర్రప్ప తాత కొన్ని సంవత్సరాల కిత్రం మృతి చెందారు. ఆయన పేరుతో ఆలయ ఆవరణంలో చిన్నగుడి నిర్మించారు. ఈ గుడిలో ఎర్రప్ప తాత, మూర్తి ప్రతిష్ఠాపన విషయంలో కొళగల్లు గ్రామంలో కొన్ని రోజులుగా రెండు వర్గాల మధ్య బేదాభిప్రాయాలు వచ్చాయి. ఇటీవలే ఆలయంలో ఎర్రప్ప తాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ విషయంపై మరో సముదాయం కోర్టుకెళ్ళారు. గుడినుంచి ఎర్రప్పతాత మూర్తిని తొలగించాలంటూ కోర్టు ఈ మధ్యనే తీర్పునిచ్చింది. దాని ప్రకారం దేవాలయంలో మూర్తిని తొలగించారు. అయితే దేవాలయంలో మూర్తిని తిరిగి ప్రతిష్ఠించాలని మరో సముదాయం పట్టుపట్టారు. ఈ విషయంలో ఆదివారం ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ జరిగడంతో ఒకరిపై ఒకరు రాళ్ళు రువ్వుకున్నారు. ఇన్ని రోజులు నివురుగప్పిన నిపులా ఉన్న ఈ వివాదం ఆదివారం రాత్రి భగ్గుమనడంతో గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా తయారయ్యింది. ఘర్షణను నియంత్రించేదుకు వెళ్ళిన పోలీసులపై రాళ్ళురువ్వడంతో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు లాఠీచార్జ్ చేశారు. ఆ సమయంలో పోలీసులు గాయపడ్డారు. ఈ ఘటనలో రూరల్ పీఎస్ఐ సంతోష్ డబ్బిన్, సీపీఐ సతీష్‌లతో పాటు ముగ్గురు పోలీసు అధికారులు గాయపడడంతో కొళగల్లు గ్రామంలో పరిస్థితి విషమించింది. దీంతో జిల్లా ఎస్పీ 144 సెక్షన్ విధించి పరిస్థితిని అదుపుచేశారు. ఈ ఘటనలో 20మంది ఆందోళన కారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఎస్‌యూసీఐతోనే సామాన్యులకు న్యాయం

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 8: కేంద్ర, రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా గ్రామీణ ప్రాంతాల ప్రజల తల రాతలు మారడం లేదని, నిత్యం సమస్యల పరిష్కారం కోసం పోరాడే ఎస్‌యూసీఐ అభ్యర్థికి మద్దతు పలకాలని పార్టీ లోక్‌సభ అభ్యర్థి ఎ.దేవదాస్ కోరారు. సోమవారం బళ్లారి తాలూకా పరిధిలోని ఎత్తినబూదిహాల్ గ్రామంలో ఉపాధిహామి పథకంలో పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్ళి ఆయన ఓటును అభ్యర్థించారు. బీజేపీ ప్రభుత్వం పేదల అవస రాలను మరిచిపోయిందని, నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగ, విద్య ఆరోగ్యం లాంటి సమస్యలు సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధిచెప్పాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా సమితి సభ్యులు గోవింద, సభ్యులు గురళ్ళి రాజ, పాలాక్ష, రైతు ధనరాజ్, బసవరాజు, మారెప్ప, లాలెప్ప తదితరులు పాల్గొన్నారు.



కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న ఎస్‌యూసీఐ అభ్యర్థి దేవదాస్

ఓటుహక్కుపై అవగాహన

బళ్లారి సిటీ, ఏప్రిల్ 8: పటిష్ఠమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు వేయాలని, ఓటు వేయడం అందరి బాధ్యత అని జిల్లా వైద్యాధికారి రమేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం జిల్లా యంత్రాంగం, జిల్లా స్వీప్ కమిటీ, మహానగర పాలక సంస్థ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ , దేవీనగర్, పార్వతీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన జాతాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఓటు వేసిన ప్పుడే పాలకులను ప్రశ్నించగలమన్నారు. జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లా మాట్లాడుతూ ఓటింగ్ శాతాన్ని పెంపొందించేందుకు, ఓటు ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకే అవగాహన నిర్వహిస్తు న్నామన్నారు. ఈసందర్భంగా జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దానప్పనవర్, దేవీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాకారిణి సుధారాణి, డాక్టర్ ప్రమోద్, శాంతమ్మ, నింగప్ప, అనిత కేశవ్, రామకృష్ణ, రష్మీ, సుప్రీత, శ్వేత, ప్రశాంత్, ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్తలు, కార్పోరేషన్ సిబ్బంది రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఓటుపై అవగాహన జాతాలో వైద్య సిబ్బంది



మాట్లాడుతున్న కాంగ్రెస్‌నాయకుడు హెచ్.శ్రీనాథ్

20 స్థానాల్లో కాంగ్రెస్‌దే విజయం

● మాజీ ఎమ్మెల్సీ హెచ్.శ్రీనాథ్

గంగావతి రూరల్, ఏప్రిల్ 8: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ జోరు పెంచింది. సోమవారం ప్రచారంలో మాజీ ఎమ్మెల్సీ హెచ్.శ్రీనాథ్ మాట్లాడుతూ 20 స్థానాల్లో కాంగ్రెస గెలుపు ఖాయమన్నారు. ధరల భారంతో బీజేపీ పేదలను పీడిస్తుందన్నారు. ఐదు గ్యారెంటీ కార్డులను పేదలకు అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. లోక్ అభ్యర్థి రాజశేఖర్ ఇట్నాల్‌ను గెలిపించాలన్నారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ అమరేగౌడ బయ్యాపూర్, హసన్‌సాబు, షామిదా మునియర్, హనుమంతప్ప, సర్వేశ్ నాగప్ప, శైలజ, అనేక మంది కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'ఆత్మకథ నాటక గొంబే' పుస్తకం విడుదల

బళ్లారి సిటీ, ఏప్రిల్ 8: దేశవిదేశాల్లో పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన రాఘవ శిష్యుడు జోళదరాశి దొడ్డనగౌడ, ఆయన శిష్యుడు సిడిగినమోలే చంద్రయ్య, ఆయన శిష్యుడు బెళగల్లు వీరన్న ఇలా ఈ ఆధునిక యుగంలో గురుశిష్య వారసత్వానికి సజీవ సాక్షిగా బెళగల్లు వీరన్ననిలిచారు అని కర్ణాటక బయలాట అకాడమీ అధ్యక్షుడు దుర్గాదాసు పేర్కొన్నారు. నగరంలోని రాఘవకళామందిరలో ఆదివారం సాయంత్రం జరిగిన స్మారక కార్యక్రమంలో బెళగల్లు వీరన్న రచించిన 'ఆత్మకథ నాటక గొంబే' పుస్తకాన్ని ఆయన విడుదల చేసి మాట్లాడారు. రంగతోరణ అధ్యక్షుడు భీమనసేన, కార్యదర్శి ప్రభుదేవ కప్పగల్లు, తిప్పేస్వామి, సుబ్బన్న పాల్గొన్నారు.



పుస్తకాన్ని విడుదల చేస్తున్న కళాకారులు

కాళికాదేవికి ప్రత్యేక పూజలు

కంప్లి, ఏప్రిల్ 8 : పట్టణంలో వెలసిని కాళికాదేవికి అమావాస్య సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉదయం జలాభిషేకం, అమృతాభిషేకం, కుంకుమార్చన, లలిత సహస్ర నామాలు, ఆకు పూజలు, పుష్పాలంకరణ చేపట్టారు. పట్టణంతో పాటు వివిధ గ్రామాలు, క్యాంపుల భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయ కమిటీ పదాధికారులు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.



అలంకరణలో కాళికాదేవి

ఎండవేడి తాళలేక వృద్ధుడి మృతి..!

రాయచూరు, ఏప్రిల్ 8 : నగరంలోని యక్లాస్‌పుర కాలనీకి చెందిన 70 ఏళ్ల వృద్ధుడు రామణ్ణ ఎండవేడి తాళలేక మృత్యువాతపడ్డారు. ఆదివారం సాయంత్రం రోడ్డు పై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడు ఒక్కసారిగా తూళి కిందపడిపోయాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గమనించిన స్థానికులు ఆస్పత్రికే తరలించగా వృద్ధుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పెరుగుతున్న వేడితాపంతో తల్లడిల్లిపోతున్నామంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేవారు.



మృతి చెందిన రామణ్ణ

కల్తీకల్లు తయారీపై పోలీసుల దాడులు

రాయచూరు, ఏప్రిల్ 8 : లోకసభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎక్సైజ్ పోలీస్ శాఖ అధికారులు అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతున్నారు. సోమవారం నగరంలోని 26వ వార్డు మడ్డిపేట ప్రాంతంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన కల్తీకల్లును స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కొన్నాళ్లుగా ఈ ప్రాంతంలో అక్రమంగా కల్లు తయారు చేసి అమ్ముతున్నట్లు వారు తెలిపారు. ఎక్సైజ్ పోలీస్ శాఖ అధికారులు రవికుమార్ నేతృత్వంలో జరిపిన దాడుల్లో వెయ్యి లీటర్‌లకు పైగా సీహెచ్ పౌడర్‌తో తయారు చేసిన కల్తీకల్లు పట్టుబడింది. ఇద్దరు నిందితులు అర్బాస్, జలీల్‌లను అదుపులోకి తీసుకున్నారు. కీలక నిందితుడిగా ఉన్న వాహీద్ తన భార్య పిల్లలతో కలిసి పరారైనట్లు ఎక్సైజ్ పోలీస్ శాఖ అధికారులు తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



కల్తీకల్లు, సీహెచ్ పౌడర్ తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

'ఓటు వేయడం అందరి బాధ్యత'

సిరుగుప్ప, ఏప్రిల్ 8 : ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రజాప్రభుత్వ వ్యవస్థలో ఒక హక్కు అని జిల్లా న్యాయాధికారి హుస్సేన్ సాబ్ తెలిపారు. సోమవారం సిరుగుప్ప పట్టణంలో నగరసభ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ విధి కార్యక్రమాన్ని చేపట్టారు. జడ్జి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు తమ తమ పరిధిలో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి సమాచారం అందజేయాలని సూచించారు. నగరసభ కమిషనర్ గురుప్రసాద్, సముదాయ అధికారి అమరేష, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న న్యాయాధికారి హుస్సేన్ సాబ్

హోసూరు జోన్

రూ.30 లక్షల నగదు స్వాధీనం



సబ్ కలెక్టర్ కార్యాలయంలో నగదు, నగలు అప్పగిస్తున్న అధికారులు

హోసూరు(క్రైం) ఏప్రిల్ 8: జుజువాడీ చెకపోస్టు వద్ద తనిఖీల రూ.30 లక్షల 50 వేలు నగదు, సుమారు 500 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి కోయంబత్తూరు వెళ్తున్న లగ్జరీ బస్సులో ఫ్లయింగ్ ఫోర్స్ అధికారులు తనిఖీలు చేయగా కోయంబత్తూరుకు చెందిన నగల వ్యాపారి రాజ్‌కుమార్ సరైన పత్రాలు లేకుండా నగలను విక్రయించేందుకు తీసుకొచ్చినట్లు తెలిసింది. 500 గ్రాముల బంగారు ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదు, నగలను హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంకకు అప్పగించారు.

ఉగాది సందర్భంగా మార్కెట్ కిటకిట



కిటకిటలాడుతున్న పూల మార్కెట్

హోసూరు, ఏప్రిల్ 8: ఉగాది పండుగ నేపథ్యంలో మార్కెట్‌లు ప్రజలతో కిటిటలాడాయి. పండుగకు అవసరమైన పూలు, పండ్లు, మామిడికు, వేపాకు ఇతరత్రా అన్నీ కొంచెం ధర ఎక్కువగానే పలికాయి. తిరువణ్ణామలై, మదురై, సేలం, ధర్మపురి , కృష్ణగిరి, హోసూరు, తళి, బాగలూరు, బేరికై, శూలగిరితో పాటు వివిధ ప్రాంతాల నుంచి నిత్యం పది టన్నులకు పైగా పూలు వస్తుంటాయి. ఎండలు మండుతుండడంతో పూల దిగుబడి తగ్గింది. ప్రతిరోజు దాదాపు 3-4 టన్నుల పూలు మార్కెట్‌కు వస్తున్నాయి. పండుగ నేపథ్యంలో సోమవారం పూలధరలు ఎక్కువగానే ఉన్నాయి. మల్లి పూలు కిలో రూ.700, కనకాంబరం రూ.800, చెండుమల్లి రూ.250, గులాబీ రూ.200, సంపంగి రూ.200 ధర పలికాయి. పండుగ కారణంగా ధరలు ఎలా ఉన్నా ప్రజలు ఉత్సాహంగా కొనుగోలు చేయడంతో రైతులు, వ్యాపారుల్లో హర్షం వ్యక్తమైంది.

ఓటు హక్కుపై విస్తృత అవగాహన

హోసూరు, ఏప్రిల్ 8: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని కలెక్టర్ సరయు పిలుపునిచ్చారు. జిల్లా ఎన్నికల అధికారిగా ప్రజల్లో ఓటు హక్కుపై విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం హోసూరు కార్పొరేషన్ బస్టాండ్‌లో బెలూన్లను గాలిలోకి వదిలారు. జిల్లా రెవెన్యూ అధికారి సాధనకురళ్, హోసూరు కార్పొరేషన్ కమిషనర్ స్నేహా, వ్యవసాయ సంయుక్త సంచాలకులు పచ్చయ్యప్పన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రైతుబజారు, విద్యుత్ కార్యాలయం, హోసూరు క్రీడా మైదానం సమీపంల్లో ఒన్నలవాడీ, సానసంద్రం, చూడుగొండపల్లి, గ్రామంల్లో వ్యవసాయ శాఖ అధికారులు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు భువనేశ్వరీ, డిప్యూటీ అగ్రికల్చర్ అధికారి మురుగేశన్, 'ఆత్మ' జిల్లా టెక్నికల్ మేనేజర్ సుగుణ, అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు

పరిహారం చెల్లించకపోతే పరిశ్రమల భూముల్లో సాగు

● కుడితిని భూబాధిత రైతు సంఘం నాయకుల హెచ్చరిక



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు బసవరాజు, సత్యబాబు తదితరులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 8: పరిశ్రమలకు ఇచ్చిన భూములకు నష్టపరిహారం ఇవ్వకపోతే ఆ భూముల్లో సాగు చేస్తామని కర్ణాటక ప్రాంత రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బసవరాజు హెచ్చరించారు. సోమవారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుడితినిలో భూబాధితులు చేపట్టిన పోరాటం 500 రోజులకు చేరిందన్నారు. న్యాయస్థానం ఆదేశించినా పరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. 13వేల ఎకరాలకు పైబడి భూమి కోల్పోవడంతో ఎస్సీ, ఎస్టీ, దేవదాసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా... రైతులకు భరోసా కల్పించే నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం చేస్తోందన్నారు. దేవనహళ్ళి, అనేకల్ తాలూకాలో కూడా రైతులు మోసపోయారు. బెంగళూరులో జరిగిన భూబాధిత రైతుల రాష్ట్ర సదస్సులో సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తులు, ఆర్థిక నిపుణులు సైతం రైతుల గోడుపై నిరసన తెలిపారన్నారు. కుడితిని భూబాధితులపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడ్తామన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యబాబు మాట్లాడుతూ గతేడాది సీఎం సమక్షంలో భూబాధితుల సమస్యలపై సమీక్ష జరిగినా, చర్యలు శూన్యమన్నారు. కర్ణాటక జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విదనాలకు నిరసనగా జూన్‌లో రాష్ట్రస్థాయి పోరాటాలు చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ప్రదాన కార్యదర్శి చన్నబసయ్య, తిప్పేస్వామి, కన్నడ రక్షణ వేదిక నాయకులు జంగ్లీసాబ్, అంజనప్ప, వెంకటేశ్, దేవదాసీ మహిళా విముక్తి సంఘం జిల్లా కార్యదర్శి స్వామి, జనవాది మహిళా సంఘం చంద్రకుమారి, కుడితిని చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన భూబాధితులు పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోండి : సీఐ

సిరుగుప్ప, ఏప్రిల్ 8 : ఉగాది, రంజాన్ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని హిందూ, ముస్లింలను సీఐ హనుమంతప్ప కోరారు. సోమవారం సిరుగుప్ప పట్టణ పోలీస్ స్టేషన్‌లో పండుగలు పురస్కరించుకుని శాంతిసభ నిర్వహించారు. ఈ సారి రెండు పండుగలు ఒకటేసారి వచ్చాయని, పరస్పర సహకారంతో పండగలను జరుపు కోవాలని ఆయన పేర్కొన్నారు. ఎస్ఐ తిమ్మన్న నాయక్ మాట్లాడుతూ పండుగలను పురస్కరించుకుని భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పండగల సంబరాల్లో ఎన్నికల కోడ్‌ను అతిక్రమించరాదన్నారు. హిందూ, ముస్లిం పెద్దలు, సార్వజనికులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

కంప్లి, ఏప్రిల్ 8 : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సరిహద్దుల్లో అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. సోమవారం ఉప్పరహళ్లి, కంప్లి కోట వద్ద తహసీల్దార్ శివరాజ్ వాహనాల తనిఖీలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఆధారాలు లేని నగదును తీసుకెళితే వెంటనే సీజ్ చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.




వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సరిహద్దులో పేలుడు వస్తువులు స్వాధీనం

బెంగళూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ సరిహద్దు కోలారు జిల్లా ముళబాగిలు తాలూకా నంగళి చెక్‌పోస్ట్‌లో భారీ పేలుడు వస్తువులను సోమవారం స్వాధీనం చేసుకున్నారు. కారులో పేలుడు వస్తువులను తరలిస్తుండగా పోలీసుల సోదాలలో పట్టుబడ్డాయి. అసీఫ్ హజరత్ అలి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి పరారయ్యాడు. అతడి నుంచి 1200 జిలెటిన్ స్టిక్స్, 7 బాక్సుల వైరు, 6 డిటోనేటర్లు స్వాధీనం చేసుకున్నారు. గనుల తవ్వకాలకు లేదా ఇతరత్రా వాటికి తరలిస్తున్నారా.. అనే కోణంలో ఆరా తీస్తున్నట్టు నంగళి పోలీసులు తెలిపారు.

రాష్ట్రమంతటా ఉగాది సందడి

● గవర్నర్, సీఎం, డీసీఎం సహా ప్రముఖుల శుభాకాంక్షలు



బెంగళూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్రమంతటా సందడి నెలకొంది. హిందూ సంప్రదాయబద్ధంగా కొత్త సంవత్సరాన్ని స్వాగతించే వేడుక ఉగాది. చైత్రమాసం ప్రారంభం రోజున జరుపుకొనే ఉగాది పండుగ కోసం బెంగళూరు సహా రాష్ట్రమంతటా సందడి వాతావరణం నెలకొంది. ప్రతిచోటా కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. ఉగాది పండుగ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయడం, పూర్వీకులను తలచుకునే ధూపం వేయడం ఆనవాయితీగా ఉంది. కొత్తబట్టల కొనుగోళ్ల కోసం దుకాణాలు రద్దీగా మారాయి. మార్కెట్‌లో పూలు, పండ్లు, కూరగాయల కోసం ప్రజలు పెద్ద ఎత్తున కనిపించారు. ప్రతిచోటా పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర ప్రజలకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సహా ప్రముఖులు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం మరింత కొత్తదనం ప్రతి ఒక్కరికి చేకూరాలని ఆకాంక్షించారు. తెలుగురాష్ట్రాల్లో ప్రత్యేకంగా జరుపుకొనే ఉగాది పండుగ కోసం పెద్ద ఎత్తున ప్రజలు సొంతూళ్లకు వెళ్లారు.


కేఆర్ మార్కెట్‌లో పూల విక్రయాలు ఇలా..



ప్రత్యక్ష రాజకీయాలకు వీరప్పమొయిలీ
గుడ్‌బై

● చిక్కబళ్లాపుర లోక్‌సభ టిక్కెట్ దక్కకపోవడంతో సీనియర్ నేత మనస్తాపం...



బెంగళూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రిగా వ్యవహరించిన కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్పమొయిలీ ప్రత్యక్ష రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. చిక్కబళ్లాపుర లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయడానికి ప్రయత్నించారు. టిక్కెట్ దక్కకపోవడంతో ప్రత్యక్ష రాజకీయాల నుంచి విరమించుకుంటున్న సోమవారం ప్రకటించారు. దశాబ్దాల కాలంగా కాంగ్రెస్‌లో వివిధ హోదాలలో పనిచేసిన వీరప్పమొయిలీకి టిక్కెట్ దక్కకపోవడంతో ఆయన అభిమానులకు నిరాశ మిగిలింది. చిక్కబళ్లాపుర టిక్కెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. సదరు టిక్కెట్ రక్షా రామయ్యకు కేటాయించడంతో వీరప్పమొయిలీ నిరాశ చెందారు. కొన్ని రోజులపాటు మౌనంగా ఉన్న వీరప్పమొయిలీ చివరకు రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. వీరప్పమొయిలీ కేవలం రాజకీయనేత మాత్రమే కాదు సాహితీవేత్త. ఆయన భార్య మాలతీ మొయిలీ కూడా రచయిత్రి. సుళిగాలి, సాగరదీప, కొట్ట, తంబెర వంటి నవలలతోపాటు మిలన, ప్రేమమందిర, పరాజిత వంటి నాటకాలు రచించారు. హాలు జేను, మత్తె నడెయలి సమర, యక్షప్రశ్న వంటి కవన సంకలనాలను రాశారు. శ్రీరామాయణ మహాన్వేషణ, బాహుబలి, అహింసా దిగ్విజయం వంటి మహాకావ్యాలను రచించారు. దక్షిణకన్నడ జిల్లాకు చెందిన వీరప్పమొయిలీ 1974-1977 దాకా రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమలశాఖ మంత్రిగాను, 1980-82 దాకా ఆర్థికశాఖ మంత్రిగాను, 1983-85 మధ్య శాసనసభలో ప్రతిపక్షనేతగాను, 1989-92 మధ్య న్యాయ, యువజన సేవలు, సంస్కృతి, సమాచార, శాసనసభ వ్యవహారాలు, విద్యాశాఖ మంత్రిగా వ్యవహరించారు. 1992-94వరకు ముఖ్యమంత్రిగా కొనసాగారు. 2000 నుంచి 2002 దాకా పన్నుల సంస్కరణ కమిషన్ ఛైర్మన్‌గాను, 2005 నుంచి 2009 దాకా రెండో పాలనా సంస్కరణల కమిషన్ ఛైర్మన్‌గాను, 2002 నుంచి 2004 వరకు రెవెన్యూ సంస్కరణల కమిషన్ ఛైర్మన్‌గాను, 2006 నుంచి 2009 దాకా కేంద్ర విద్యాసంస్థలలో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్ అమలుకు పర్యవేక్షక కమిటీ ఛైర్మన్‌గాను, 2009 నుంచి 2011 దాకా కేంద్ర న్యాయ వ్యవహారాలశాఖ మంత్రిగాను, 2011 నుంచి 2012లో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలశాఖ మంత్రిగాను, కేంద్ర పెట్రోలియం, ప్రకృతి వనరుల శాఖ మంత్రిగాను వ్యవహరించారు. 2020లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారంతోపాటు కర్ణాటక సహా వివిధ రాష్ట్రాలలో వివిధ గౌరవాలు అందుకున్నారు.

52మంది నామినేషన్ల ఉపసంహరణ

బెంగళూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలివిడత లోక్‌సభ ఎన్నికలు జరిగే 14 నియోజకవర్గాలకు సంబంధించి సోమవారం 52మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. అత్యధికంగా బెంగళూరు గ్రామీణలో 12మంది, చామరాజనగరలో 8మంది, మైసూరులో ఆరుగురు, మండ్యలో ఐదుగురు, బెంగళూరు సెంట్రల్, తుమకూరు, చిత్రదుర్గలో నలుగురు చొప్పున నామినేషన్ ఉపసంహరించుకున్నారు. 358 మంది అభ్యర్థులు 429 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా 74 తిరస్కరణకు గురయ్యాయి. పరిశీలన నాటికి 300మంది అభ్యర్థులు మిగలగా తాజాగా 52మంది, ఈనెల 6న ఒకరు ఉపసంహరించుకున్నారు. దీంతో 247మంది బరిలో మిగిలారు. వీరిలో 226 మంది పురుషులు కాగా 21మంది మహిళలు ఉన్నారు.

అఖండ చూపు బీజేపీ వైపు

బెంగళూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే అఖండ శ్రీనివాసమూర్తి బీజేపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. సోమవారం బెంగళూరు ఉత్తర లోక్‌సభ బీజేపీ అభ్యర్థి శోభాకరంద్లాజె, మాజీ ఎమ్మెల్యే అఖండ నివాసానికి వచ్చారు. ఇరువురూ రాజకీయ అంశాలపై చర్చించారు. బీజేపీలో చేరాలన్న ఆమె సూచనకు సూత్రప్రాయంగా అంగీకరించినట్టు సమాచారం. దీన్నిబట్టి రెండు మూడు రోజుల్లోనే ఆయన బీజేపీలో చేరడం ఖరారైనట్టుగా ఉంది. పులకేశినగర్ నుంచి తొలుత జేడీఎస్ ఎమ్మెల్యేగా వ్యవహరించిన ఆయన కొన్ని కారణాలతో కాంగ్రెస్‌లో చేరారు. అక్కడ ఎమ్మెల్యేగా గెలుపొందినా 2023 ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ ఇవ్వలేదు. దీంతో బీఎస్పీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు.


మాజీ ఎమ్మెల్యే అఖండ శ్రీనివాసమూర్తితో బీజేపీ నాయకులు

కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి

ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బొమ్మనహళ్లి, ఏప్రిల్ 8: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తోందని, శాసనసభ ఎన్నికల్లో తాము ఇచ్చిన హామీలు మూడు నెలల్లోపే అమలు చేశామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. బొమ్మనహళ్లి, హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్, హొంగసంద్రలో రోడ్ షో సందర్భంగా ఆయన కాంగ్రెస్ నాయకుడు నాగభూషణ్‌రెడ్డి నివాసంలో కొద్దిసేపు విరామం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా అబద్ధాలతోనే నెట్టుకొస్తోందన్నారు. రాష్ట్రంలో కరువు నెలకొన్నా కేంద్రప్రభుత్వం మానవత్వం చూపలేదని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. బెంగళూరు దక్షిణలో సౌమ్యరెడ్డి విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో తేజస్విసూర్యకు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీ పథకాలు ఐదేళ్లపాటు కొనసాగుతాయన్నారు. మరిన్ని పథకాలతో ముందుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామలింగారెడ్డి, ఎమ్మెల్సీ నారాయణస్వామి, హెచ్‌ఎం రేవణ్ణ, ఉమాపతి గౌడ, కేపీసీసీ సభ్యుడు బాలకృష్ణారెడ్డి, నాయకులు సయ్యద్‌సర్దార్, వాసుదేవరెడ్డి, రవీంద్ర, అశ్వత్థనారాయణస్వామి, వాసుదేవరెడ్డి, రాఘవేంద్ర, శ్యామణ్ణరెడ్డి, ఉమా శ్రీనివాసరెడ్డి, మధుసూధనరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సీఎంను సత్కరిస్తున్న స్థానిక నాయకులు


వాణి శివరాంను స్వాగతిస్తున్న పార్టీ నాయకులు

కాంగ్రెస్‌లో చేరిన వాణి శివరాం

బెంగళూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ఐఏఎస్ అధికారి, దివంగత శివరాం భార్య వాణి శివరాం కాంగ్రెస్‌లో చేరారు. కేపీసీసీలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఆమెను సాదరంగా స్వాగతించారు. ఆమెతోపాటు మాజీ కార్పొరేటర్ రూపాలింగేశ్, జేడీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీకే రవిచంద్ర, మడివాళా సామాజికవర్గానికి చెందిన గోపికృష్ణ, మహ్మద్ ముస్తాఫాతోపాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. మల్లికార్జున ఖర్గే నాయకత్వాన్ని బలపరిచేందుకు పార్టీలో చేరినట్టు వాణిశివరాం ప్రకటించారు. ఇదే సందర్భంగా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా తేజస్వినిగౌడను నియమించినట్టు డీకే శివకుమార్ ప్రకటించారు.

సంగీతకు వినియోగదారులే రాయబారులు

● గోల్డెన్‌జూబ్లీ సందర్భంగా ఏడాది పొడవునా రాయితీలు

బెంగళూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సంగీత మొబైల్స్‌కు ప్రత్యేకించి రాయబారులు లేరని, ప్రతి వినియోగదారుడు తమకు రాయబారి అని, సంస్థ గోల్డెన్‌జూబ్లీని పురస్కరించుకుని ఏడాది పొడవునా రాయితీలు అందిస్తున్నట్టు ఎండీ ఎల్.సుభాష్‌చంద్ర వెల్లడించారు. ఉగాది పండుగ సందర్భంగా బెంగళూరులో సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఉగాది పండుగ అంటేనే సంతోషమని, ఉత్తమ ఆఫర్లు ఎప్పటికీ సంగీతలోనే సాధ్యమన్నారు. సంగీత మొబైల్స్‌లో 30 రోజుల ప్రైజ్ డ్రాప్, డ్యామేజ్ ప్రొటెక్షన్‌తో 50శాతం చెల్లిస్తే కొత్త ఫోన్ సొంతం చేసుకునే సౌలభ్యం కొనసాగుతోందని అన్నారు. యాపిల్ ఫోన్‌పై ప్రత్యేక రాయితీ ఉందన్నారు. ప్రతి ఫోన్‌పైనా రూ.3వేల నుంచి రూ.12వేల దాకా క్యాష్‌బ్యాక్ సౌలభ్యం సొంతం చేసుకోవచ్చు అన్నారు. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలనే మొబైల్స్‌తోపాటు ఎంఐ, లాయిడ్, మెడ్జ్ టెలివిజన్‌లు విక్రయిస్తున్నామన్నారు. విద్యార్థులు, అన్నిరంగాల ఉద్యోగుల కోసం హెచ్‌పీ, డెల్, ఎంఐ, ఏసెర్ ల్యాప్‌టాప్‌లు ఉన్నాయన్నారు. ఎండ వేడిమితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అందుకే సంగీతలో ఎయిర్ కండీషనర్‌లు అందుబాటులోకి తెచ్చామన్నారు. రూ.499, 2,499లతో స్పీకర్‌లను అందిస్తున్నామని, రికార్డింగ్, ఎఫ్‌ఎం రేడియో, ఫ్రెంచ్ డిజైన్ గాడ్జెట్‌లు ఉన్నాయన్నారు. స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్‌లు సంగీతలో సిద్ధమని తెలిపారు. రిటైల్ రంగంలో ఐదు దశాబ్దాలు ప్రయాణించడమే గొప్పదనమని, సంగీత మజిలీలో ఎంతో మంది వినియోగదారుల విశ్వాసం, నమ్మకంతోనే సాధ్యమైందని అన్నారు. 7 రాష్ట్రాల్లో 800 స్టోర్లతో నిత్యం వేలాది మందికి నాణ్యమైన ఉపకరణాలను అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది 40 షోరూంలు తెరవదలిచామని వివరించారు. బిగ్ స్టోర్‌లో తెరిచే ఆలోచనలో ఉన్నామన్నారు.



సంగీత షోరూం

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

వేలూరి శివరామశాస్త్రి (జయంతి)



ప్రముఖ పండితులు, శతావ ధాని, బహుశాస్త్రవేత్త వేలూరి శివ రామశాస్త్రి 1892 ఏప్రిల్ 9న కృష్ణా జిల్లా చిరివాడలో జన్మించా రు. చిన్నతనంలోనే వేద వేదా లను, శాస్త్రాలను ఔపోశన పట్టారు. పలు భారతీయ భాష ల్లో పాండిత్యం సాధించారు. యోగం, సాంఖ్యం, వేదాం తం, జ్యోతిష్యం తదితర శాస్త్రాలలో ఆయన పరిశ్రమ నిరుపమానం. తిరుపతి వేంకటకవుల దారిలోనే ఆయన నడుస్తూ ఆంధ్ర దేశంలోని అన్ని నగరాల్లోనూ అష్టావధానాలు, శతావధానాలు నిర్వహించి గురు వులకు తగిన శిష్యుడిగా పేరొందారు. తొలిదశలో గ్రాంధికభాష వైపు మొగ్గినా చివరకు వ్యవహారభాషకు ఊతమిచ్చారు. సంస్థానాధీశులు, సాహితీ ప్రియులచే పలు సత్కారాలు అందుకున్నారు. 1967 మార్చి 17న కన్నుమూశారు.

ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్ (జయంతి)



కర్ణాటక సంగీత విద్వాంసుడు, పద్మభూషణ్ గ్రహీత ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్ 1899 ఏప్రిల్ 9న తమిళనాడు రాష్ట్రం తిరుచ్చిలో జన్మించారు. 1920లో ప్రారంభమైన ఆయన సంగీత యాత్ర దశాబ్దాల పాటు అప్రతిహతంగా కొనసాగడం విశేషం. కర్ణాటక సంగీత రంగంలో పితామహగా అరుదైన గుర్తింపుపొందారు. సంగీత కళానిధి, సంగీత శిఖామణి, పద్మవిభూషణ్ పురస్కారం అందుకున్నారు. 1975 మార్చి 25న పరమపదించారు.

మన్నవ బాలయ్య (జయంతి, వర్ధంతి)



మన్నవ బాలయ్య 1930 ఏప్రిల్ 9న గుంటూరు జిల్లా చేవ పాడులో జన్మించారు. వృత్తిరీత్యా అధ్యాపకుడైనప్పటికీ నటుడిగానే పరిచయం. ఎక్కువగా సహాయక నటుడి పాత్రలు పోషించారు. నిర్మాత, రచయిత గాను రాణించారు. 350కుపైగా సినిమాల్లో నటించారు. కొన్ని సినిమాలకు కథ, పాటలు కూడా అందించారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లతో కలసి నటించారు. 'చెల్లెలి కాపురం' సినిమాకు నిర్మాతగా ఉత్తమ బంగారు నంది పురస్కారం లభించింది. పౌరాణిక, జానపద, సాంఘిక సినిమాలతోపాటు కొన్ని బుల్లితెర సీరియల్స్ లోనూ నటించారు. 2022 ఏప్రిల్ 9న కన్నుమూశారు.

జయాబచ్చన్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత జయాబచ్చన్ 1948 ఏప్రిల్ 9న మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్పూర్‌లో జన్మించారు. సినీరంగంతో పాటు రాజకీయ రంగంలోనూ రాణించారు. 2004 నుంచి సమాజవాది పార్టీ తరపున రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 1971లో నిర్మించిన 'గుడ్డీ' చిత్రం లో జయాబచ్చన్ ఓ ప్రముఖ పాత్రను పోషించారు. పలు హిట్ సినిమాల్లో నటించారు. 11 సార్లు ఫిలింఫేర్ పురస్కారం అందుకున్నారు. 1992 లో పద్మశ్రీ పుర స్కారాన్ని అందుకున్నారు. ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్‌ను వివాహమాడారు. 2017లో ఉత్తమ పార్లమెంటేరియన్ పురస్కారం అందుకున్నారు.

జుంజప్పస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు



జుంజప్పస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

గుడిబండ, ఏప్రిల్ 6: కర్ణాటక రాష్ట్రంలోని శిర తాలూకా కళారుహళ్లి సమీపంలో వెలసిన జుంజప్ప స్వామి, కుర్లహళ్లిభూతప్పస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పూజారిపల్లి, ఎస్‌రాయాపురం, హేమావతి, నాగేపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు సోమవారం జుంజప్పస్వామి ఆలయానికి పెద్దఎత్తున చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేక మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

పెనుకొండ, ఏప్రిల్ 8: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అక్రమ మద్యం రవాణాపై ఉక్కుపాదం మోపినట్లు సెబ్ డిప్యూటీ కమిషనర్ (డీసీ) నాగమద్దయ్య తెలిపారు. స్థానిక సెబ్ స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అక్రమంగా మద్యం నిలువ ఉంచిన గోదాములు, అక్రమ రవాణా మార్గాలు, కేంద్రాలను తనిఖీ చేస్తున్నామన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచామన్నారు. సరిహద్దు చెక్‌పోస్టులను బలోపేతం చేసి, అక్రమ మద్యం కట్టడికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి సెబ్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, పెనుకొండ సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వద్దు

పుట్టపర్తి, ఏప్రిల్ 4: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి.. జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విజయవాడలోని తన కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టరు అరుణ్‌బాబు ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో చేపట్టిన తాగునీటి సరఫరా చర్యలను కలెక్టర్ వివరించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, ఉపాధి హామీ, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై సీఎస్‌కు వివరించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జున, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించకుంటే ఎన్నికల బహిష్కరణ

» గ్రామస్థుల హెచ్చరిక



మీడియాతో గ్రామస్థులు, రైతుసంఘాల నాయకులు

దొడ్డబళ్ళాపుర, ఏప్రిల్ 8: తాగునీటి సమస్యను పరిష్కరించుకుంటే లోక్‌సభ ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్థులు హెచ్చరించారు. తాలూకాలోని దొడ్డతుమకూరు, హొసహళ్ళి గ్రామపంచాయతీ గ్రామస్థులు, అర్కావతి చెరువు సంరక్షణ సమితి సోమవారం మీడియాతో మాట్లాడుతూ దొడ్డబళ్ళాపుర నగరసభ, బాశెట్టిహళ్ళి పట్టణ పంచాయతీ, పారిశ్రామిక వాడలనుంచి వచ్చే వ్యర్థపురనీరు చిక్క తుమకూరు, దొడ్డతుమకూరు చెరువులలో చేరుతుండడంతో చుట్టుపక్కల గ్రామాలభూగర్భజలాలు కలుషితం అవుతున్నాయన్నారు. దీని పరిణామం పశువులు సైతం నీరు తాగేందుకు వెనుకడుగు వేస్తున్నాయన్నారు. సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన కరువైందన్నారు. దొడ్డతుమకూరు, హొసహళ్ళి గ్రామ పంచాయతీలలో శుద్ధతాగునీటికోసం మూడేళ్లుగా అర్కావతి నది సంరక్షణ సమితి నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. నీటి కోసం ఏళ్ల తరబడి పోరాటాలు చేయాల్సి రావడం విచారకరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగమైన ఎన్నికలను బహిష్కరించదలిచేలా తీర్మానించామన్నారు. ఎన్నికల ప్రచారానికి తమ గ్రామాల్లోకి ఏ పార్టీ నాయకులను కూడా అనుమతించేది లేదన్నారు. సమావేశంలో పోరాట సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఆంజినప్ప మాట్లాడుతూ ఎన్నికలను బహిష్కరించడం ద్వారానైనా తమ సమస్యను ప్రభుత్వం గుర్తిస్తుందని భావిస్తున్నామన్నారు. తన ఓటు రాజాజినగర్‌లో ఉందని, అయినా తాను ఓటు వేయకుండా పోరాటానికి మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు ఆదిత్యానాగేశ్ మాట్లాడుతూ గతంలో పోరాటం వేళ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కేహెచ్ మునియప్ప సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని అయితే అమలు కాలేదన్నారు. జిల్లా అధికారులు రెండోదశ సంస్కరణ విభాగం ఏర్పాటు చేస్తామన్నారని అయితే ఇంతవరకు భూస్వాధీన ప్రక్రియ చేపట్టలేదన్నారు. అందుకే తాము ఎన్నికలను బహిష్కరించదలిచామన్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే...

దొడ్డబళ్ళాపుర నగరసభ, బాశెట్టిహళ్ళి పట్టణ పంచాయతీ డ్రైనేజీ నీటి సంస్కరణ కోసం మూడోదశ ఎస్‌టీపీ ఏర్పాటు చేయాలి. రెండు పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాలకు జక్కల మడుగు నీటిని కల్పించాలి. కొన్ని గ్రామాలకే పరిమితమైన ఈ విధానం అన్ని గ్రామాలకు తప్పనిసరి చేయాలి. రెండు పంచాయతీలలోనూ ప్రతి ఇంటికీ వర్షపు నీటి సేకరణ పద్ధతి అమలు చేయాలి. ఇందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలి లేదా ఫ్యాక్టరీల సహ కారంతో ప్రతి ఇంటికీ తాగునీటికోసం వర్షపునీటి సేకరణ విధానం అమలు చేయాలి. మీడియా సమావేశంలో ప్రము ఖుడు బమూల్ డైరెక్టర్ బీసీ ఆనంద్‌కుమార్, తాలూకా పంచాయతీ మాజీ సభ్యుడు బీహెచ్ కెంపణ్ణ, ఎంపీసీఎస్ అధ్యక్షుడు టీ రంగరాజు, ఆదిత్యానాగేశ్, సందేశ్, ప్రస్తుత సభ్యులు చైత్ర భాస్కర్, మాజీ ఉపాధ్యక్షులు చైత్ర శ్రీధర్, రైతు ప్రముఖులు వసంత్, సతీశ్, రమేశ్, పెద్దసంఖ్యలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ బరిలోకి దింగాలేశ్వరస్వామి

» ఉత్కంఠగా మారిన ధారవాడ

» రాష్ట్ర రాజకీయాల్లోకి స్వామిజీ

బెంగళూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో మరో హాట్‌టాపిక్‌గా ధారవాడ నియోజకవర్గం మారింది. ఎన్నికల్లో ఓ స్వామిజీ పోటీకి సిద్ధం కావడంతో సర్వత్రా కుతూహలం నెలకొంది. ధారవాడ నియోజకవర్గం నుంచి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి మరోసారి బీజేపీ అభ్యర్థిగా రంగంలోకి దిగారు. కాంగ్రెస్ నుంచి కురుబ సమాజానికి చెందిన వినోద్ అసోటి అభ్యర్థిగా ప్రకటించారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఉం



మీడియాతో దింగాలేశ్వరస్వామి

టుందని భావించారు. అనూహ్యంగా స్వామిజీ పోటీ చేయాలని తీర్మానించుకోవడంతో రాష్ట్ర ఎన్నికల్లో ఇదో సంచలనమైన నియోజకవర్గంగా మారింది. స్వామిజీ బరిలోకి దిగితే నియోజకవర్గంలో బ్రాహ్మణ, లింగాయత సామాజికవర్గాల అభ్యర్థుల మధ్య పోటీ రసవత్తరం కానుంది. నియోజకవర్గంలో 7 లక్షల మందిదాకా లింగాయత సామాజిక వర్గానికి చెందినవారు ఉన్నారు. ఎన్నికల ఫలితాలలో వీరే నిర్ణయాత్మక శక్తి. ప్రహ్లాద్‌జోషి నాలుగుసార్లు ఇదే స్థానం నుంచి విజయం సాధించారు. ఐదోసారి ఆయన అదృష్టాన్ని పరీక్షించుకోదలిచారు. దింగాలేశ్వరస్వామి పోటీ విషయం బహిరంగం కావడంతో ప్రహ్లాద్‌జోషి రాష్ట్రానికి చెందిన ప్రముఖ స్వామిజీలు, బీజేపీ అగ్రనేతలతో చర్చలు జరిపారు. స్వామిజీ పోటీ చేస్తే ఎన్నికల్లో భారీ వ్యత్యాసం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దింగాలేశ్వరస్వామి ఎవరంటే...?

శిరహట్టి మఠం ఫకీరదింగాలేశ్వరస్వామిజీ తరచూ వివాదాల్లో ఉంటారు. సెక్యులర్ పోరాటం, లెఫ్టిస్ట్ కోణంలో ఎదిగిన ఆయన హుబ్బళ్లిలోని మూరుసావిర మఠం ఉత్తరాధికారి హోదా కోసం పోరాటం చేశారు. మఠం విషయంలో ఆయన పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కొప్పళ జిల్లా కుష్టగి తాలూకా బొమ్మనాళ గ్రామానికి చెందిన దింగాలేశ్వరస్వామి 1995 ఏప్రిల్ 20న గదగ్ జిల్లా శిరహట్టి, బాళేహోసూరు గ్రామంలోని దింగాలేశ్వర మఠానికి ఆరో మఠాధిపతి అయ్యారు. 2022లో శిరహట్టిలోని జగద్గురు ఫకీరేశ్వర మఠానికి ఉత్తరాధికారిగా నియమితులయ్యారు. అప్పటి నుంచి శిరహట్టి ఫకీర దింగాలేశ్వర స్వామిగా పేరొందారు. హుబ్బళ్లి, ధారవాడ, గదగ్, హావేరి జిల్లాల్లో ఈ మఠానికి ప్రాబల్యం ఉంది. ధారవాడ లోక్‌సభ పరిధిలో ఏడు లక్షల మంది లింగాయతలు ఉన్నారు. వీరే ఎన్నికల్లో క్రియాశీలకం కానున్నారు. గడిచిన నాలుగు లోక్‌సభ ఎన్నికల్లోనూ బ్రాహ్మణ సముదాయానికి చెందిన ప్రహ్లాద్‌జోషి పోటీ చేస్తూ భారీ మెజారిటీతో విజయం సాధించారు. ప్రహ్లాద్‌జోషిపై గడిచిన రెండు ఎన్నికల్లో లింగాయత వర్గంలోని ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు వినయ్ కులకర్ణి పోటీ చేసినా ఓటమి చెందారు. ధారవాడ పరిధిలో ఆర్ఎస్ఎస్‌కు ప్రాబల్యం ఉంది. 90వ దశకం నుంచి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో హిందూత్వ బలంతోనే గెలుపు సునాయాసం అవుతోంది. హిందూత్వ సిద్ధాంతాలపైనే బీజేపీ ఇక్కడ మరింత శక్తివంతమైంది. దింగాలేశ్వరస్వామి గడిచిన కొన్ని నెలలుగా బీజేపీ అభ్యర్థిగా ఎవరినైనా పోటీ చేయించాలని, ప్రహ్లాద్‌జోషికి టిక్కెట్ ఇవ్వరాదని డిమాండ్ చేశారు. ఇది తన అభిప్రాయం కాదని, ఆయన నుంచి ఇబ్బంది పడ్డ ప్రజల అభిప్రాయమని పలు సందర్భాలలో వ్యాఖ్యానించారు. ధారవాడకు చెందిన జగదీశ్ శెట్టర్ బీజేపీని వీడి కాంగ్రెలోకి వెళ్లేందుకు జోషినే కారణమని ఆరోపించారు. లింగాయతల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని విమర్శించారు. జగదీశ్‌శెట్టర్‌కు ఎమ్మెల్యే టిక్కెట్ తప్పించ



డంలోనూ కుట్ర ఉందని, యడియూరప్పను సీఎం స్థానం నుంచి మధ్యలోనే దించేశారని, ఇవి లింగాయత సమాజానికి జరిగిన అవమానాలుగా భావిస్తున్నామని అన్నారు. ఈ అన్నింటి కారణాలతోనే పోటీ చేస్తున్నట్టు దింగాలేశ్వర స్వామి ప్రకటించారు. శిరహట్టి మఠంలో కొన్ని రోజుల క్రితమే 5,555 నాణేలతో తులాభారం చేశారు. సమైక్యతను పెంచేలా హుబ్బళ్లి సహా పలు చోట్ల ఉత్సవాలు జరిపారు. ఈ మఠానికి కులమతాలతో సం బంధం లేకుండా అన్నివర్గాల ప్రజలు వస్తారు. ప్రస్తుతం దింగాలేశ్వరస్వామి రంగంలోకి దిగడంతో బీజేపీ నాయకులు డోలాయమానంలో పడ్డారు. ఒకవేళ ఆయన వెనుకడుగు వేయలేదంటే పరిస్థితిలో భారీ మార్పులు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా సోమవారం ప్రహ్లాద్‌జోషి అభిమానుల పేరిట దింగాలేశ్వరస్వామిపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. స్వామిజీగానైనా ఉం డాలని లేనిపక్షంలో రాజకీయాల్లోకి అయినా రావాలని సవాల్ విసిరారు. ఇది దింగాలేశ్వరస్వామితోపాటు ఆయన అభిమానులను మరింత రెచ్చగొట్టినట్టు అయింది. జాతీయ రాజకీయాల్లో కొన్నేళ్లపాటు కొనసాగి ప్రస్తుతం యూపీ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్న యోగి ఆదిత్యనాథ్ తరహాలోనే రాష్ట్రంలోనూ ఓ స్వామిజీ రాజకీయాల్లోకి అడుగు పెడుతున్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేనన్ని మఠాలు కర్ణాటకలో ఉన్నాయి. ప్రతి కులానికి ఇక్కడ మఠాలు, గురువులు, స్వామిజీలు ఉన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ స్వామిజీల సలహాలు ఆశీస్సులకు అనుగుణంగానే అభ్యర్థుల విజయాలు ఆధారపడి ఉంటాయి. అటువంటిది ఏకంగా లింగాయత సామాజికవర్గానికి చెందిన స్వామిజీ ఎన్నికల బరిలోకి రావడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చరిత్రను తిరగరాసినట్టు అవుతోంది.

ఉప్పరపేటలో ఓటుహక్కుపై జాగృతి



కళాబృందాలతో జాతా ఇలా...

చింతామణి, ఏప్రిల్ 8: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తాలూకా స్వీప్ సమితి నేతృత్వంలో అంబాజిదుర్గ హోబళి ఉప్పరపేట గ్రామపంచాయతీలో సోమవారం ఓటు హక్కుపై జాగృతి చేపట్టారు. తాలూకా పంచాయతీ ఈఓ ఎస్ ఆనంద్ నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. జానపదకళా బృందాలు పెద్దసంఖ్యలో పాల్గొన్నాయి. చింతామణి-శిడ్లఘట్ట జాతీయ రహదారిపై ఉప్పరపేట బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఆనంద్ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిస్తున్నామన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రజాప్రభుత్వంలో ఓటు మన హక్కు అన్నారు. ఓటు వేయడం ప్రజల కర్తవ్యంగా భావించాలన్నారు. వందశాతం ఓటింగ్ లక్ష్యానికి ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ మహేశ్ బాబు, పీడీఓ శివణ్ణ, నరేగా ఏడీ కవితా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి...



కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారపేట, ఏప్రిల్ 8: లోక్‌సభ ఎన్నికల వేళ పలువురు పార్టీలు జంప్ అవుతుంటారు. ఇందులో భాగంగా బీజేపీ, జేడీఎస్‌లను వీడిన కొందరు కార్యకర్తలు, స్థానిక నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. పట్టణంలోని కాంగ్రెస్‌భవన్‌లో సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో జేడీఎస్, బీజేపీలనుంచి వీడిన 40మందికి పైగా కాంగ్రెస్‌లో చేరారు. త్యారనహళ్ళికి చెందిన నారాయణస్వామి నేతృత్వంలో మాజీ సభ్యుడు చంద్రశేఖర్, ఆయన అనుచరులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాగా ఈనెల 12న కామసముద్ర హోబళి, బూదికోటె హోబళిలలో కార్యకర్తల సమావేశం జరగనుందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి కేవీ గౌతమ్, ఇన్‌చార్జ్ మంత్రి, ప్రముఖులు పాల్గొంటారని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణస్వామిని దొడ్డవలగమాది గ్రామపంచాయతీ సభ్యుడు ఐమసపుర జీవన్ సత్క రించారు. నగరబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చందుకుమార్, గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు గోపాల్, సభ్యులు రామరెడ్డి, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రామేగౌడ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

350 మంది విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులతో పిల్లలు

బెంగళూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్ సీఎస్ఆర్‌లో భాగంగా శీగేహళ్ళి ప్రభుత్వ పాఠశాలకు చెందిన 350మంది విద్యార్థులకు బ్యాగులు ఇతరత్రా పంపిణీ చేశారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ నిత్యానంద అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు చదివే పాఠశాలకు తమవంతు సహకారం అందించాలనే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బెంచీలు, కుర్చీలతోపాటు వాటర్ కూలర్‌ను అందించామన్నారు. వైట్‌ఫీల్డ్ విభాగం డీసీపీ శివకుమార్ గుణారెతోపాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనిచేయించుకుని జీతాలు ఎగ్గొట్టారు



ఎస్పీ మాధవరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న యోగా టీచర్లు

పుట్టపర్తి రూరల్, ఏప్రెల్ 8: యోగా టీచర్ ఉద్యోగం పేరుతో పనిచేయించుకుని జీతాలు ఇవ్వకుండా మోసం చేశారని, తమకు న్యాయం చేయాలంటూ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డికి యోగాటీచర్లు ఫిర్యాదు చేశారు. స్థానిక జిల్లాపోలీసు కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయప్ప, యోగా టీచర్లు సతీష్, శివకుమారి, లలిత, హరినాయక్ సోమవారం ఎస్పీని కలిశారు. వారు మాట్లాడుతూ.. గుంటూరుకు చెందిన బుద్ధా ఫౌండేషన్ యోగా సెంటర్లను జిల్లాలో ఏర్పాటు చేసిందన్నారు. యోగా టీచర్లుగా తమ సేవలను 15 నెలలు ఉపయోగించుకుని ఆ సంస్థ చైర్మన్ తమకు రావాల్సిన రూ.15 లక్షల జీతాలు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. తమకు న్యాయం చేయాలని ఎస్పీని కోరారు. తాము ఆ సంస్థలో 15 నెలలపాటు ఉద్యోగం చేశామన్నారు. తమకు రావాల్సిన జీతాలు ఇవ్వకుండా సంస్థ మోసం చేసిందన్నారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ విచారించి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

హాసన్‌లో రూ.9.50 కోట్ల విలువైన బీరు పట్టివేత

బెంగళూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): హాసన్ నగర పరిధిలోని వుడ్‌పెకర్ డిస్టిలరీస్ అండ్ బ్రూవరీస్ ఫ్యాక్టరీపై దాడి చేసిన అబ్కారీ అధికారులు రూ.9.50 కోట్ల విలువైన బీర్ బాటిళ్ళను పట్టివేశారు. లోక్‌సభ ఎన్నికల వేళ అబ్కారీ శాఖాధికారులు దాడి చేశారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న బీర్ బాటిళ్లకు తగిన రికార్డులు లేని కారణంగా స్వాధీనం చేసుకున్నారు. పవర్‌కూల్, లెజెండ్, బ్లాక్‌ఫోర్ట్, వుడ్‌పేకర్ బ్రాండ్‌ల బీర్ బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. 56236 బాక్సుల నుంచి 5,63,756 లీటర్లు ఉంటుందని వీటి విలువ రూ.9,54,08,422లుగా ఉంటుందని అధికారులు ప్రకటించారు. సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్లు ఆదివారం ప్రకటించారు.

నేటి నుంచి కరగ ఉత్సవం

శిడ్లఘట్ట, ఏప్రిల్ 8: ఎల్లమ్మదేవి కరగ ఉత్సవం ఈనెల 9 నుంచి 11వరకు మూడు రోజులపాటు ఘనంగా జరగనుంది. మంగళవారం అమ్మవారికి అభిషేకం, పుష్పాలంకరణ, మహామంగళారతి అనంతరం తీర్థ ప్రసాద వినియోగం జరగనుంది. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ కూడా నిర్వహించనున్నారు. రాత్రి కరగధారి వెంట వీరకుమారులు హసి కరగతో ఊరేగనున్నారు. 10న కూడా అమ్మవారికి విశేషపూజలు కొనసాగనున్నాయి. 11న ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు. రాత్రి 11 గంటలకు పూల కరగ ఊరేగింపు జరగనుంది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ ప్రకటనలో పేర్కొంది.

రోడ్డుపై బీడా బంకు



రోడ్డుపక్కనే ఇలా బీడా బంకు

దొమ్మసంద్ర, ఏప్రిల్ 8: సర్జాపుర - బెంగళూరు రోడ్డులోని దొమ్మసంద్ర ముత్తనల్లూరు క్రాస్ వద్ద ఉత్తర భారత్‌కు చెందిన యాదవ్ అనే వ్యక్తి బీడా బంకు నిర్వహిస్తున్నాడు. ఈ మార్గంలో ట్రాఫిక్ అధికంగా ఉంది. అయినా రోడ్డుకు అత్యంత సమీపంలోనే బంకు ఉంది. ఇందుకు సంబంధించి దొమ్మసంద్ర గ్రామపంచాయతీ అధికారి మంజునాథ్ రెడ్డిని అడగ్గా పరిశీలిస్తామన్నారు. పోలీసులను అడిగితే తమకు తెలియదని అంటున్నారు. రద్దీ ప్రదేశంలో కనీస అనుమతులు ఉన్నాయా లేదో కూడా దర్జాగా బంకు కొనసాగుతున్నా అధికారుల స్పందన అంతంతమాత్రంగానే ఉండడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

పడమటి ఈరన్న ఉత్సవాలు ప్రారంభం



ఎద్దుల బండితో ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

తాడిమర్రి, ఏప్రిల్ 8: ఉగాది పండుగ సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే పడమటి ఈరన్న ఉత్సవాలు సోమవారం మొదలయ్యాయి. పసుపతి నాథుడుగా పేరుగాంచి మండలంలోని ఆత్మకూరు గ్రామంలో వెలసిన పడమటి ఈరన్నస్వామి ఆలయం ఎద్దులబండ్లను, పశువులను ఉగాది పండుగ ముందు రోజు ప్రదక్షిణలు చేయించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా తాడిమర్రి మండలంలోని పలు గ్రామాల రైతులు ఎద్దులబండ్లను అందంగా అలంకరించి స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం స్వామిని దర్శించుకుని పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలు వారం రోజులు కొనసాగుతాయని, ఉగాది రోజు అధికసంఖ్యలో భక్తులు హాజరై మొక్కుబడులు తీర్చుకుంటారని గ్రామస్థులు తెలిపారు.

హుబ్లీ, విజయవాడ మధ్య ఉగాది ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఏప్రిల్ 8: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రైళ్లలో ప్రయాణికుల రద్దీ నిరయంత్రణ కోసం హుబ్లీ-విజయవాడ-హుబ్లీ మధ్య (వయా గుంతకల్లు, బళ్లారి) ఓ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ-హుబ్లీ (నెం.07001) ప్రత్యేక రైలు ఈ నెల 10వ తేదీన విజయవాడలో మధ్యాహ్నం రెండున్నరకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7-10 గంటలకు హుబ్లీకి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం.07002) ఈనెల 11వ తేదీన హుబ్లీలో ఉదయం 9-25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 1 గంటకు విజయవాడకు చేరుతుందన్నారు. ఈ రైలు గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, దొణకొండ, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుంతకల్లు, బళ్లారి, తోరణగల్లు, హోసపేట, మునీరాబాద్, కొప్పళ, గదగ్, అనిగిరి స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.